క్లుప్తంగా

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

మంత్రి పార్థసారథి



చాట్రాయి: జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. శనివారం నరసింహారావుపాలెం గ్రామంలో వైద్యశాఖాధికారులతో జ్వరాలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖాధికారి శర్మిష్ఠ, ఎంపీడీఓ దుర్గాప్రసాద్, టీడీపీ నాయకులు మందపాటి బసవారెడ్డి, పుచ్చకాయల నోబుల్ రెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మైలవరం ఎస్ఐ సుధాకర్ బాధ్యతల స్వీకారం



మైలవరం: మైలవరం ఎస్ఐగా కె. సుధాకర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన విజయవాడలో వీఆర్‌లో ఉండి బదిలీపై మైలవరం వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుధాకర్ మాట్లాడుతూ మైలవరం మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతుగా కృషి చేస్తానని, ప్రజలు సహకరించాలని కోరారు.

హెచ్ఐవీపై అవగాహనా ర్యాలీ



నూజివీడు: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉంటేనే నియంత్రించడం సాధ్యమవుతుందని రైడ్స్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఎం. లక్ష్మి అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి పిలుపు మేరకు రైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీకి నివారణ లేదని, నియంత్రణ మాత్రమేనన్నారు. బాధితులను వివక్షతతో చూడరాదని, వారు ఏఆర్‌టీ మందులను వాడటం ద్వారా సాధారణ జీవితాన్ని గడుపవచ్చని చెప్పారు. అవుట్‌రీచ్ వర్కర్లు జి. కమల, ఈ. మాధవి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యాభ్యాసం



చాట్రాయి: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని నూజివీడు సీఐ రామకృష్ణ అన్నారు. 'మీ పోలీసు, మీ రక్షణ' కార్యక్రమం శనివారం పోలవరం హైస్కూల్‌లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్ వలన తోటి విద్యార్థులు ఇబ్బందులు పడతారని, అలాంటి చర్యలకు పాల్పడవద్దని చెప్పారు. చట్టాలు, పోలీసు విధులు, సెక్షన్లు తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని, నేరగాళ్ల వలలో పడినపుడు ఎలా తప్పించుకోవాలో పోలీసుల ద్వారా తెలుసుకోవాలని చెప్పారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ స్వామి పాల్గొన్నారు.

సార్వత్రిక విద్య వైపు దృష్టి మరల్చండి

ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు



ముసునూరు: వివిధ కారణాలు, ఆర్థిక ఇబ్బందులతో చదువు మధ్యలోనే మానేసిన విద్యార్థులు, గృహిణులు సార్వత్రిక విద్య ద్వారా తిరిగి చదువుకోవచ్చునని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు అన్నారు. ముసునూరులో వెలుగు మహిళా సమాఖ్య సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ దూర విద్యలో ప్రవేశాలు, అభ్యాసం తదితర విషయాలను వివరించారు. 14 ఏళ్ల వయస్సు గలిగి చదువు మధ్యలో మానివేసిన వారు ఓపెన్ టెన్త్‌కు, 16 ఏళ్లు నిండి పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఇంటర్మీడియెట్ విద్యను అభ్యసించవచ్చని చెప్పారు. ముసునూరు హైస్కూల్లో పదో తరగతి అభ్యసించేందుకు అవకాశముందన్నారు. సమావేశంలో ఏపీఎం కుంటం బాబు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పద్మావతి, లీడర్స్, సభ్యులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల అందజేత

గానుగపాడు(తిరువూరు రూరల్): గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎం. రాంప్రదీప్ నోట్ పుస్తకాలను శనివారం అందజేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్‌వీబీ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు భద్రత పెంచాలి



కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచార, హత్య ఘటన చాలా బాధాకరం. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన అవసరం ఉంది. ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ 24 గంటలు పనిచేస్తుంది. రాత్రివేళల్లో నర్సులు, సిబ్బంది డ్యూటీలో ఉంటారు. ఎవరైనా అగంతకులు వస్తే బయటకు తెలియని పరిస్థితి ఉంది. వైద్యశాలకు, ఆరోగ్య సిబ్బందికి మరింత భద్రత పెంచాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ టి.సుమంత్, పీహెచ్‌సీ వైద్యులు, ఇబ్రహీంపట్నం



నిందితులను కఠినంగా శిక్షించాలి



ప్రాణాలు కాపాడే వైద్యురాలిని కోల్‌కతాలో అత్యాచారం చేసి హత్య చేయడం అమానుషం. నిందితులను కఠినంగా శిక్షించాలి. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించే బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలి. నిందితులను అరెస్ట్ చేసినా బెయిల్‌పై బయటకు వస్తున్నారు. నాన్ బెయిలబుల్ సెక్షన్లతో కేసులు నమోదు చేయాలి.

– కేవీఎస్ నారాయణ, పీహెచ్‌సీ సీహెచ్‌ఓ, ఇబ్రహీంపట్నం

40 ఏళ్లుగా నరకయాతన

- తాగేందుకు నీరు లేక అవస్థలు
- వెలగని వీధి దీపాలు
- రాత్రయితే అంధకారంలోనే..
- కనీస సాకర్యాలు లేక ఒడిశా వలస కార్మికుల ఇబ్బందులు



ఒడిశా నుంచి వచ్చిన వలస కార్మికులు

జి.కొండూరు: ఒడిశా నుంచి నాలుగు దశాబ్దాల కిందట గడ్డమణుగు లోయ ప్రాంతానికి 65 కుటుంబాల వారు వలస వచ్చారు. తాత్కాలికంగా పాకలు వేసుకుని నివాసం ఉంటున్నారు. ఇక్కడ నీటి కోసం వేసిన బోరు నుంచి రసాయనాలు కలిసిన నీరు పసుపు రంగులో వస్తోంది. ఈ నీరు తాగితే ఎలర్జీలు వస్తున్నాయి. వీధిలైట్లు ఉన్నా వెలగవు. రాత్రయితే వారి బతుకుల్లోలాగే అంధకారం నిండుకుంటోంది. సమీపంలోనే అటవీప్రాంతం ఉండటంతో వన్య ప్రాణులు, విష సర్పాల సంచారంతో నిత్యం ప్రమాదాలతో వీరు సహవాసం చేస్తున్నారు.

ఓటు బ్యాంకుగానే చూస్తున్నారు..

గడ్డమణుగు లోయ ప్రాంతంలో రెండు క్యాంపులుగా అటవీ ప్రాంతానికి అతి దగ్గరలో ఒడిశా కార్మికులు జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ నివసిస్తున్న మనుషులను ఓటు బ్యాంకుగానే చూస్తున్న ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం మినహా అమలు చేసిన దాఖలాలు కనిపించవు. పొరుగు రాష్ట్రానికి చెందిన వారమనే తమపై చిన్నచూపు తప్ప తమపై కనీస జాలి చూపించే నాథుడే లేడని అక్కడ నివసిస్తున్న కుటుంబాల మాటలు కలిచివేస్తున్నాయి.

ప్రధానంగా నీటి సమస్య

ఈ రెండు క్యాంపులలో ప్రధానంగా నీటి సమస్య ఉంది. రోజువారీ అవసరాలకు వాడుకునేందుకు బోరు ఏర్పాటు చేసినప్పటికీ మోటారు సక్రమంగా పనిచేయకపోవడంతో పాటు బోరులో రసాయనాలు కలిసిన నీరు రావడంతో నీరంతా పసుపు రంగులోకి మారుతోంది. ఆ నీటిని వాడటం వల్ల ఎలర్జీలతో పాటు అనారోగ్యం పాలవుతున్నారు. దగ్గరలో తాగేందుకు నీరు లేకపోవడంతో గడ్డమణుగు నుంచి ప్రైవేటు వ్యక్తులు తాగునీటిని ట్యాంకరు ద్వారా తీసుకువచ్చి లీటరు రూ.2 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ క్యాంపులలో విద్యుత్ సౌకర్యం ఉన్నప్పటికీ వీధిలైట్లు పనిచేయక చిమ్మ చీకట్లోనే నరకయాతన పడుతున్నారు.



మోటారు పనిచేయక నీటి కోసం ట్యాంకు వద్ద ఉంచిన బిందెలు, డబ్బాలు

వసతులు కరువు

ఒడిశాకు చెందిన 65 కుటుంబాల వారు జీవనోపాధి కోసం ఇక్కడకు వచ్చారు. గత నాలుగు దశాబ్దాలుగా జి.కొండూరు మండల పరిధి గడ్డమణుగు లోయ ప్రాంతంలోని కొండపల్లి అటవీ ప్రాంతానికి ఆనుకొని నివాసం ఉంటున్నారు. ఈ రెండు క్యాంపులలో కలిపి 270 మంది వరకు జనాభా ఉండగా 90కి పైగా ఓటర్లు ఉన్నారు.



బోరు నుంచి వస్తున్న పసుపు రంగు నీరు

వీరిలో రేషన్ కార్డులు ఉన్న 16 కుటుంబాలకు మాత్రమే ఇప్పటి వరకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. వీరిలో సగం మంది మాత్రమే శాశ్వత గృహాలు నిర్మించుకోగా మిగిలిన కుటుంబాల వారు పూరి పాకలలోనే నివాసం ఉంటున్నారు. వీరంతా దగ్గర్లోనే క్వారీలు, క్రషర్లు, ఐడీఏలోని పలు కంపెనీలలో రోజువారీ కూలీకి వెళుతుంటారు. రెండు క్యాంపులలో నివాసం ఉంటున్న ఈ కుటుంబాలు కనీస వసతులు లేక నరకయాతన పడుతున్నారు.

ప్రభుత్వ పథకాలు అందవు

ఈ రెండు క్యాంపులలో నాలుగు దశాబ్దాలుగా నివసిస్తున్న మూడొంతుల కుటుంబాలకు ఇప్పటి వరకు ఆధార్ కార్డులు కానీ, రేషన్ కార్డులు కానీ లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడంలేదు. వీరిపై అధికారులు సైతం చిన్నచూపు చూస్తున్నట్లు అక్కడి పరిస్థితులు చూసిన వారికి ఇట్టే అర్థమవుతోంది.

తమను వలస కార్మికులుగా ముద్ర వేసి ఒక్కచోటు స్థిరంగా ఉండరని స్థానిక అధికారులు ఉన్నతాధికారులకు నివేదికలు ఇచ్చి తమకు ఎటువంటి వసతుల కల్పించడం లేదని స్థానికులు వాపోతున్నారు. అంతేకాకుండా చిన్నపాటి గుడిసెలలో ఉంటున్న తమకు విద్యుత్ బిల్లులు నెలకు రూ.1500 నుంచి రూ.2 వేల వరకు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వీధిలైట్లు వెలగవు



మా క్యాంపులో వీధి లైట్లు లేక నరకయాతన పడుతున్నాం. తాగునీటి సమస్య ఉంది. లీటరు రూ.2 చొప్పున కొనుక్కుంటున్నాం. మాకు వచ్చే కూలీ డబ్బులు నెల ఖర్చులకే సరిపోవడం లేదు. తాగునీటిని కొనుక్కోవాలంటే ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి మా క్యాంపులో అందరికి ఇళ్లు కట్టించి మా సమస్యలు పరిష్కరించాలి.

– మొదిలి గౌరి, గడ్డమణుగు లోయ

ఎలర్జీలు వస్తున్నాయి



మా క్యాంపు దగ్గర్లో ఏర్పాటు చేసిన బోరు నుంచి వచ్చే నీరు రంగుమారి వస్తుంది. ఆ నీరు వాడడం వల్ల ఎలర్జీలు వస్తున్నాయి. మోటారు సక్రమంగా పని చేయడంలేదు. నీళ్ల కోసం గంటల కొద్దీ వేచి ఉండాల్సి వస్తోంది. అధికారులు వెంటనే స్పందించి కనీస వసతులు కల్పించాలి.

– నాగ అరుణ్, గడ్డమణుగు లోయ

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే శ్రీనివాసరావు



విస్సన్నపేట: భవిష్యత్‌లో ఏమి సాధించాలన్నా విద్యతోనే సాధ్యమని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వికాస్ కళాశాలలో ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తున్నారని, దానిని దృష్టిలో పెట్టుకొని మంచి లక్ష్యంతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. వికాస్ విద్యా సంస్థలను నెలకొల్పి ఈ పరిసర ప్రాంతంలో ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారని యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో వికాస్ విద్యాసంస్థల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి, కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



ఆగిరిపల్లి: పోతవరప్పాడు ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ తమ్మిశెట్టి అశోక్ విట్ యూనివర్సిటీ ద్వారా పీహెచ్‌డీ డిగ్రీ పట్టాను పొందారు. 'సిములేషన్ అండ్ మోడలింగ్' అంశంపై పరిశోధన చేసినందుకు గాను ఆయనకు డాక్టరేట్ పట్టా లభించింది. ఈ సందర్భంగా అశోక్‌ను కళాశాల చైర్మన్ ఆర్.వెంకట్రావు, ప్రిన్సిపాల్ నాగభాస్కర్, అకడమిక్ డైరెక్టర్ సాంబశివరావు, పలువురు అధ్యాపకులు అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- రూరల్ సీఐ కె. రామకృష్ణ
- పల్లెర్లమూడిలో పోలీసుల పల్లెనిద్ర



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

నూజివీడు: రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నూజివీడు రూరల్ సీఐ కె. రామకృష్ణ అన్నారు. పల్లెర్లమూడిలో శుక్రవారం రాత్రి పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో పోలీసు అధికారులు సమావేశం నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ మీ ఆధార్‌కార్డు అప్‌డేట్ చేయాలని లింకు పంపితే దానిని ఓపెన్ చేయడం, బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నాం ఓటీపీ చెప్పండంటూ ఫోన్ చేసి అడగగానే ఓటీపీ చెప్పడం వంటివి చేస్తూ ప్రజలు మోసపోతున్నారని చెప్పారు. అలాంటి మెసేజ్‌లకు ఎవరూ స్పందించవద్దని, సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి తెలపాలన్నారు. ప్రజలు ఆపద సమయాల్లో 112కు ఫోన్ చేస్తే 15 నుంచి 20 నిమిషాల వ్యవధిలో పోలీసు వారు సహాయ సహకారాలు అందిస్తారని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రూరల్ ఎస్ఐ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ కొత్త చట్టాలు, మహిళలపై జరిగే అఘాయిత్యాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. గంజాయి, మత్తు పదార్థాలు, ఇసుక అక్రమ రవాణాపై పోలీసు వారికి సమాచారం అందిస్తే వాటిని నివారిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తారకరామ ఎడమ కాలువలో తూటికాడ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

జి.కొండూరు: తారకరామ ఎడమ కాలువలో తూటికాడ అల్లుకుపోవడంతో నీటి ప్రవాహం ముందుకు సాగక వరి పైరు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనిపై ఈ నెల 23న 'ముంచేసిన తూడు' శీర్షికన 'సాక్షి' కథనం ప్రచురించింది. అధికారులు స్పందించి ఈలప్రోలు లెఫ్ట్ మెయిన్ కెనాల్ ప్రారంభం వద్ద లాకులు దించగా శనివారం కాలువలోని తూటికాడను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. తారకరామ ఏఈ సతీష్‌బాబు ఆధ్వర్యంలో పొక్లెయిన్‌తో తూటికాడ తొలగింపు చర్యలను వేగవంతం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చివరి భూములకు కూడా నీరందేలా అన్ని చర్యలు చేపడుతున్నామని ఏఈ సతీష్‌బాబు తెలిపారు.



తూటికాడ తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న ఏఈ సతీష్‌బాబు

అంతరిక్ష పరిశోధనలపై అవగాహన

మైలవరం: సైన్స్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగాధిపతి వి. ఉమాలక్ష్మి ఆధ్వర్యంలో నేషనల్ స్పేస్ డేను పురస్కరించుకుని విద్యార్థులకు శనివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం స్ఫూర్తితో విద్యార్థులు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. స్పేస్ డే ప్రాముఖ్యతను వివరించారు. క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జె. రాముడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏరో స్పేస్ విభాగంలో చంద్రయాన్–3 మిషన్ ఇస్రో మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నేషనల్ స్పేస్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు అంతరిక్షయానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. డిజిటల్ పోస్టర్ ప్రజంటేషన్ ఆన్ పాస్ట్ అండ్ ఫ్యూచర్ మూన్ మిషన్, ఫ్యూచర్ మాండ్ స్పేస్ మిషన్స్ బై ఇస్రో అనే అంశాలపై ఈవెంట్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మైలవరంలో క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రవి

సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో యువతకు ఉచిత శిక్షణ

జగ్గయ్యపేట అర్బన్: మానవ సేవాసంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు సాఫ్ట్‌వేర్ కోర్సు(స్యాప్ ఎస్‌డీ)లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్‌కుమార్ శనివారం తెలిపారు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల విద్యార్థులకు విజయవాడలో శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణ తరగతులు సెప్టెంబర్ 28వ తేదీన ప్రారంభమై మూడు నెలలపాటు కొనసాగుతాయన్నారు. ఇతర వివరాలకు సెల్ నంబరు 99852 22857లో సంప్రదించాలని ఆయన కోరారు.

కిడ్నీ బాధితుల సమస్యలపై ధర్నా



ఎ.కొండూరు: కిడ్నీ బాధితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఎ.కొండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు, జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ మాట్లాడుతూ ఎ.కొండూరు మండలంలో గిరిజన, దళిత, బలహీన వర్గాలు, పేదలు కిడ్నీ వ్యాధి బారిన పడుతున్నారని చెప్పారు. 2024 సంవత్సరంలో ఇప్పటివరకు 63 మంది మృతి చెందారన్నారు. డయాలసిస్ రోగులకు ఇస్తున్న రూ.10 వేల పెన్షన్ సరిపోవడం లేదని, ఇతర కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఎటువంటి సహాయం అందడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తిరువూరు నియోజకవర్గంలో కిడ్నీ సమస్యలు అధ్యయనం చేసేందుకు నిపుణులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, తిరువూరు నియోజకవర్గంలో కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని, కృష్ణానది మంచి నీటి పథకానికి తక్షణమే నిధులు మంజూరు చేసి వేగంగా పూర్తి చేయాలని, డయాలసిస్ రోగులకు రూ. 20 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం ప్రజాసంఘాల నాయకులు, వివిధ గ్రామాలకు చెందిన కిడ్నీ బాధితులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కంచికచర్ల: ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే వాహనాన్ని సీజ్‌చేయడంతోపాటు కేసు నమోదు చేస్తామని కంచికచర్ల ఎస్ఐ బోనగిరి రాజు హెచ్చరించారు. మండలంలోని మోగులూరు మున్నేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

ఖాళీసీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: తిరువూరులోని బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఈ విద్యా సంవత్సరంలో 5, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ఖాళీ సీట్ల భర్తీకై విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ కోటిరెడ్డి శనివారం తెలిపారు. ఐదో తరగతిలో 12, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 8, బైపీసీలో 13 సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. దరఖాస్తులను ఈనెల 27వ తేదీలోగా తిరువూరు సాంఘిక సంక్షేమ గురుకులంలో అందజేయాలన్నారు. 28వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

జగ్గయ్యపేట: తెలంగాణకు చెందిన 288 క్వార్టర్ మద్యం సీసాలను జగ్గయ్యపేట ఎస్‌ఈబీ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఈబీ సీఐ మణికంఠరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం కోదాడ నుంచి కారులో చిల్లకల్లుకు మద్యం వస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఈబీ పోలీసులు బలుసుపాడు రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. ఈక్రమంలో ఓ కారులో 288 క్వార్టర్ మద్యం సీసాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. మద్యాన్ని కారులో తరలిస్తున్న చిల్లకల్లుకు చెందిన అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

తిరువూరు: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను తిరువూరులోని పలు పాఠశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఉట్టికొట్టే కార్యక్రమం కోలాహలంగా జరిపారు. శ్రీకృష్ణుని జన్మ వృత్తాంతాన్ని ఉపాధ్యాయులు వివరించారు. సిద్ధార్థ, నాగార్జున, శ్రీనిధి పాఠశాలల్లో



శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

వట్టిగుడిపాడులో వైద్యశిబిరం

ఆగిరిపల్లి: మండలంలోని వట్టిగుడిపాడు సచివాలయం వద్ద సగ్గూరు పీహెచ్‌సీ వైద్యురాలు సంధ్య ప్రియ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరాలు, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటం

కృష్ణలంక(విజయవాడతూర్పు): తెలుగు గడ్డపై మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగారావు అన్నారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర క్యాడర్ వర్క్‌షాప్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బంగారావు మాట్లాడుతూ.. ఉత్తర భారతంలో తన ప్రభావం తగ్గిపోతున్న విషయాన్ని గుర్తించిన సంఘ్ పరివార్ తన దృష్టిని ఒడిశా నుంచి తూర్పు తీరం రాష్ట్రాలపై దృష్టి పెట్టిందన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ తన అధికార దాహం కోసం బీజేపీకి ఓట్లు, సీట్లు ఇచ్చి ఫాసిస్ట్ శక్తులకు రంగప్రవేశం చేయించిందని ధ్వజమెత్తారు.

నవంబర్ 9న ప్రజా రాజకీయ సభ..

తన మిత్రపక్షాలను సహితం మింగేసే బీజేపీ చరిత్ర తెలిసిన వారికి టీడీపీ, జనసేన కూటమి ఎంతో కాలం సాగదన్నారు. ఈ వర్క్‌షాప్‌లో సెప్టెంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో గ్రామీణ పేదల భూమి సమస్యలు, ఇంటి స్థలాల సమస్యలపై ప్రజలను సమీకరించాలని తీర్మానించారు. అలాగే సెప్టెంబర్ 16న జాతీయ గ్రామీణ హామీ పథకంలో మోదీ సర్కార్ తెచ్చిన సవరణలు, బడ్జెట్ కేటాయింపులపై మండల స్థాయిలో ధర్నాలు చేపడతామన్నారు. అక్టోబర్ 1న గ్రామ పంచాయతీ కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, నవంబర్ 9న విజయవాడలో ప్రజా రాజకీయ సభను నిర్వహించాలని తీర్మానించారు. వర్క్‌షాప్‌లో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.